ప్రజాశక్తి
ఆదివారం 19 అక్టోబరు, 2025 5
శ్రీకాకుళం

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని డైట్ లెక్చరర్ కె.శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలను సందర్శించిన ముందుగా పదో తరగతి విద్యార్థులను వివిధ ప్రశ్నలని అడిగి సమాధానాలు రాబట్టించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి స్వయంగా పదార్థాలని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం రికార్డుల నిర్వహణపైనా సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దాట్ల దాసరథి, ఉపాధ్యాయులు రోనంకి శ్రీనివాసరావు, కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఆనంద హేళ..

- రేపు దీపావళి పండగ
- జిల్లాకు వంద మందుగుండు షాపులకు అనుమతులు
- తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ, అరసవల్లి

ఈ నెల 20న దీపావళి పండగ జరుపు కునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. దీపావళి పండగ అంటే పిల్లల నుంచి పెద్దల వరకు జరుపుకునే పండగ. మందుగుండు సామగ్రి కాల్చుకునే పండగ ఇది. పండగ ముందుకు మందుగుండు సామగ్రి అమ్మకానికి షాపులకు అనుమతులు ఇవ్వడం, సురక్షితంగా షాపుల నిర్వహణ, ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా పండగ ముందుకు సాగటం కీలకం. గతంలో కొన్ని ప్రమాద సంఘటనలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. రెవెన్యూ అధికారులు అనుమతితో జిల్లాలో శనివారం సాయంత్రం కొన్ని ప్రారంభించగా, మరోకొన్ని అదివారం ఉదయం ప్రారంభమయ్యే అవకాశంలో ఉంది. దీపావళి నేపథ్యంలో జిల్లాలో వంద మందు మందుగుండు సామగ్రి అమ్మకం షాపులకు అనుమతులు వచ్చాయి. శ్రీకాకుళం డివిజన్‌లో 62, టెక్కలి డివిజన్‌లో 17, పలాస డివిజన్‌లో 21 షాపులు నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. శ్రీకాకుళం పట్టణంలో 23 షాపులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. జిల్లాలో 8 వరకు 360 రోజులు నిర్వహించే హోల్‌సెల్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల మండలం పూడివలస, కుప్పిలి, తోటపాలెం, కొత్తపేట, సవరల వానిపేట ప్రాంతాల్లో హోల్‌సేల్ షాపులు కిటకిటలాడుతున్నాయి. మందు గుండు సామగ్రి కొనుగోళ్ల అదివారం నుంచి ఊపందుకుకుంటుంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు షాపులు అనుమతులకు అధికారులు చుట్టూ తిరుగు తున్నారు.

అనుమతులు లేని షాపులపై చర్యలు : కలెక్టర్

సారవకోట మండలం తర్లిపేట, టెక్కలిలో మందుగుండు షాపులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చల్లవానిపేట జంక్షన్ డిఎంఆర్ క్రేకర్స్ షాపుకు సరియైన అనుమతులేకుండా విక్రయాలు చేస్తున్నందును షాపుపై కేసు నమోదుకు అధికారులను ఆదేశించారు. అనంతరం చల్లవానిపేట దగ్గరలో ఉన్న శ్రీవిజయలక్ష్మి ట్రేడర్స్ బాణసంచా షాపును తనిఖీ చేశారు. వీరికి అనుమతులు ఉన్నా... విద్యుత్ శాఖ నుంచి నిరంభ్యంతర పత్రం లేనందు వల్ల అపరాధ రుసుం విధించారు. జిల్లాలో అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సురక్షితంగా దీపావళి నిర్వహించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జాగ్రత్తలు ఇవీ...

గుర్తింపు పొందిన, నాణ్యమైన బాణసంచాను అమ్ముతున్న షాప్ వద్దనే కొనడం శ్రేయస్కరం. రాత్రి 10 గంటల తర్వాత బాణసంచా కాల్చడం నిషేధం. అధిక శబ్దం, ప్రజలకు ఇబ్బంది కలిగించే బాణసంచా ఉపయోగించరాదు. బాణసంచా కాల్చిన సమయంలో కంటికి రక్షణగా ప్లెయిన్ గాగుల్స్ (కళ్లద్దాలు) వాడటం మంచిది. బాణసంచాని వంట గదుల్లోనూ, పొయ్యి, గ్యాస్ సిలిండర్లు ఉన్న ప్రాంతాల్లో ఉంచకూడదు. బాణసంచా ఎప్పుడూ ఆరుబయటే కాల్చాలి. ఇంటి కారిడార్లలో, ఇంటి లోపలా, టెర్రెస్ పైన కాల్చకూడదు. బాణసంచా కాల్చే సమయంలో వదులైన దుస్తులు ధరించాలి. వేలాడిన దుస్తులు వేసుకుంటే మంట అంటుకొనే ప్రమాదం ఉంది. అందుకే కొద్దిగా బిగుతైన దుస్తులు ధరించాలి. బాణసంచా కాల్చే సమయంలో ముందు జాగ్రత్తగా బక్కెట్లలో నీరు, ఇసుకను పక్కనే ఉంచుకోవాలి. చర్మం కాలితే కంగారు పడకుండా తొలుత గాయంపై నీళ్ల ధారగా పడేలా కడగాలి. మంట తగ్గేవరకు అలా కడిగి అప్పుడు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. ప్రమాదవశాత్తు కంటికి ఏదైనా గాయం అయినప్పుడు ఒక కన్ను మూసి, ప్రమాదానికి గురైన కంటి చూపును స్వయంగా పరీక్షించి చూసుకోవాలి. ఏమాత్రం తేడా ఉన్నా వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలి.

అనుమతులకు అనేక నిబంధనలు

నివాసాలకు దగ్గరగా బాణసంచా విక్రయ షాపుల అనుమతి ఇవ్వరు. బాణసంచా అమ్మేదగ్గర డ్రైకెమికల్ పౌడర్ నాలుగు కిలోలు, సిఒటి (కార్బన్ డై ఆక్షయిడ్) అయిదు కిలోలు దుకాణం వద్ద ఉంచాలి. అత్యంత ప్రమాదంకరమైన పే లుళ్ళ ఉన్న బాణసంచా అమ్మ కూడదు. నిబంధనలకు విరుద్ధంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఉండే ప్రదేశంలో పాఠశాలల దగ్గర, రద్దీగా ఉన్న ప్రదేశంలో అమ్మకాలు ఉండకూడదు. అగ్నిమాపాక సాధనాలు బాణసంచా అమ్మే ప్రదేశంలో ఉంచాలి. దుకాణాల మధ్య కనీసం నాలుగు మీటర్లు దూరం ఉండాలి. నీటి సదుపాయం కల్పించాలి. పొగ తాగరాదు అనే హెచ్చరిక బోర్డులను దుకాణంలో ఉంచాలి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు, హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో బాణసంచా పెల్లుళ్ల దుకాణం పెట్టకూడదు. బాణసంచా తయారుకి 15 కిలోల మించి తమ వద్ద ముడిసరుకుల నిల్వ ఉంచకూడదు. నిబంధనలు ప్రకారం దీపావళికి పేలుడు పదార్థాలు ఉంచి ఇళ్లలో బాణసంచా తయారు చేయకూడదు.

అనుమతులు తప్పనిసరి : ఎస్‌పి



దీపావళి పండగ జరుపుకొనే సమయంలో ఎంత కాంతి, ఆనందాన్ని ఇస్తుందో వికటిస్తే అంతే చీకటినీ, విషాదాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉందని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. ప్రమాదాలేవీ లేకుండా కేవలం వేడుకగా సంబరంగా దీపావళి పండను నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లల విషయంలో జిల్లా ప్రజలు అందరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పోలీసులు, సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. వారు మాత్రమే బాణసంచాలను అమ్మకాలు చేయాలన్నారు. బాణసంచా షాపులను మైదానం, ప్రజల నివాస ప్రదేశాలకు దూరంగా బహిరంగ ప్రదేశంలో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. షాపు, షాపులకు మధ్య కనీసం మూడు నుంచి ఐదు మీటర్లు దూరం తప్పనిసరిగా పాటించాలన్నారు. ముందు జాగ్రత్తగా తగినంత ఇసుక, నీరును డ్రమ్ముల్లో, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా బాణసంచా షాపుల దగ్గర అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి

స్వచ్ఛతలో ఉత్తమంగా నిలుపుతాం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ, నరసన్నపేట

స్వచ్ఛతలో దేశంలోనే ఉత్తమంగా శ్రీకాకుళాన్ని నిలుపుతామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. నగర కార్పొరేషన్ పరిధి అసరవల్లి నుంచి ఖాజీపేట రహదారిలో స్వచ్ఛాంద్రలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి పరిసరాలను శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే టాప్ 10లో శ్రీకాకుళం నిలవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో సైక్లింగ్ ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి ఇటు పర్యావరణానికి, అటు ఆరోగ్యానికి మేలు కలిగేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సండేను అందరూ సైకిల్ డే గా మార్చుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నరసన్నపేట, సారవకోట, జలుమూరు మండలాల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సారవకోట మండలంలోని సవరమాలువ దగ్గర రూ.70 లక్షలతో సిసి, సవరకురిడింగి వద్ద రూ.65 లక్షలతో బిటి, కిడిమి కూడలి వద్ద పద్మాపురానికి వెళ్లేందుకు రూ.2 కోట్లతో బిటి, వడ్డివలస వద్ద రూ.70 లక్షలతో సిసి, అల్లాడ వద్ద రూ.3 కోట్లతో బిటి రోడ్లు, కుమ్మరిగుంట వద్ద రూ.70 లక్షలతో సచివాలయం పనులకు శంకుస్థాపన చేశారు. నరసన్నపేట మండలం పారసెల్లి వద్ద రూ.35 లక్షలతో సిసి, చిల్డ్రన్ పార్కులకు శంకుస్థాపన చేశారు. సారవకోట మండలం నౌతల కూడలిలో చిన్నారులు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సారవకోట మండలం కుమ్మరిగుంటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. గతంలో నిర్మాణ దశలో ఆగిపోయిన వాటన్నింటినీ పూర్తిస్థాయి నిధుల కేటాయింపు చేసి నిర్మాణ దశను పూర్తి చేసి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నరసన్నపేట నియోజకవర్గం లో తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో నియోజకవర్గం లోని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు విస్తృతం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

ప్రజల్లో న్యాయ విజ్ఞానం ఎక్కువగా చేరేవిధంగా పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో జిల్లాలోనిపారా లీగల్ వాలంటీర్లకు నాలుగు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా .ప్రభుత్వ సంబంధిత కార్యాలయాలను సందర్శించి విధి విధానాలు, అచట న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను గూర్చి వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి, పౌర హక్కుల రక్షణ చట్టాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ 3, 4 అదనపు జిల్లా జడ్జిలు ఎస్.ఎం.ఫణికుమార్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, కె.అనురాగ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సోంపేట జడ్జి కిషోర్ బాబు

మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

ప్రజాశక్తి- మందస

సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులని సోంపేట కోర్టు ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని పెట్టువ గిరిజన గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చదువు ద్వారానే విజ్ఞానం లభిస్తుందని, తద్వారా ఏ పని చేయాలి, ఏ పని చేయకూడదనేది తెలుస్తుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు బారత రాజ్యాంగంలో అనేక అంశాలు లిఖించిన తరువాత వారికి భద్రత ఏర్పడిందని అన్నారు. సీనియర్ న్యాయవాది మడ్డు సర్వేశ్వరరావు మాట్లాడుతూ కులవివక్షత, అంటరానితనం, ఏమైనా ఉంటే పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వై.కృష్ణమోహన్, ఎం.సిహెచ్.శ్రీనివాసరావు, కె.రాజు, జగదీష్ పండా, ట్రైనింగ్ ఎస్ఐ వెంకటేష్, సుజాత, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

ప్రజాశక్తి- అరసవల్లి

'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్" వారోత్సవాలు సందర్భంగా నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో శనివారం కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. నృత్య దర్శకులు రఘు పాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యాన ఆయన శిష్య బృందం సాంప్రదాయ కూచిపూడి నృత్యాలు అలరించాయి. డిఆర్‌డిఎ సిబ్బంది జిఎస్‌టిపై ప్రత్యేక స్కిట్స్ ప్రదర్శించారు. డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 13న ప్రారంభమైన 'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్' ఎగ్జిబిషన్ కమ్‌సేల్ ప్రజల అపూర్వ స్పందన లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి రేట్లను తగ్గించిన నేపథ్యంలో, ఆ తగ్గింపు ప్రయోజనాలను నేరుగా ప్రజలకు చేర్చే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఉత్సవం ద్వారా భారీ ఎత్తున కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల నుండి మొదలుకొని కార్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ఎలక్ట్రానిక్స్, ఇంటి నిర్మాణ వస్తువులు వంటి అన్ని రకాల ఉత్పత్తులపై తగ్గిన రేట్ల ప్రయోజనాన్ని నగర వాసులు, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ అద్భుతమైన విజయంపై ఎగ్జిబిషన్ నిర్వాహక కమిటీ హర్షం వ్యక్తం చేసింది.

నృత్యం చేస్తున్న శ్రీకాంత్ శిష్య బృందం

రైతులను ఇంతలా పీడిస్తారా?

రెవెన్యూ అధికారులపై విప్ అశోక్ ఆగ్రహం

ప్రజాశక్తి- కవిటి

ఎఫ్ లైన్ కోసం రూ.30 వేలు, పొజిషన్ ధ్రువపత్రాల కోసం రూ.5 వేలు డబ్బులు వసూలు చేసి రైతులను ఇంతలా పీడిస్తారా? అంటూ రెవెన్యూ అధికారులపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని రెవెన్యూ అధికారులు, విఆర్‌ఒలు, సర్వేయర్లతో శనివారం సమీక్షించారు. ప్రతి పనికీ ఓ రేటు అంటూ కొంతమంది రెవెన్యూ అధికారుల తీరును ఎండగట్టారు. పొజిషన్ ధ్రువపత్రాల కోసం రూ.1400లు ఇస్తే చాలవు రూ.5 వేలు ఇవ్వాల్సిందే అంటూ ఓ విఆర్‌ఒ చేసిన నిర్వాకంపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌ఐ, ప్రస్తుత సీనియర్ అసిస్టెంట్ పనితీరుపై మండలంలోని రైతాంగం తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నట్టు తెలిపారు. ఎవరి వద్ద ఎంత డిమాండ్ చేశారో, ఎంత తీసుకున్నారో మొత్తం నివేదికతో నిర్వహించారు. ముఖ్యంగా తహశీల్దార్ సొంత నిర్ణయాలు తీసుకోకుండా సదరు వ్యక్తి చెప్పినట్టు నడుచుకోవడమే ఈ విశృంఖల అవినీతికి కారణమని ఎమ్మెల్యే అశోక్ అభిప్రాయపడ్డారు. గతంలో పరిస్థితి చేయి దాటిపోవడంతోనే ఒక ఆర్‌ఐ అక్రమాలు ప్రజాశక్తిలో కథనాలు వెలువడ్డాయని, మళ్లీ అదే పరిస్థితి కల్పిస్తున్నారని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు దయనీయస్థితిలో ఉన్నాడని, ఒక ధ్రువపత్రం కోసం అతన్ని అంతలా ఇబ్బంది పెట్టాలా? ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా మండలంలో జాయింట్ ఎల్‌పిఎంల సమస్య వీలైనంత వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఇకపై ఆరోపణలు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, తహశీల్దార్ మురళీమోహన్, డిటి కృష్ణమూర్తి, సిఎస్ డిటి సంతోష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి, ఆర్‌ఐ లోకనాథం, విఆర్‌ఒల సంఘం అధ్యక్షుడు వజ్జ బాలకృష్ణ పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న విప్ అశోక్

ఎయిర్‌పోర్టుపై అచ్చెన్న లెక్కలే వేరు!

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మందస కార్గో ఎయిర్‌పోర్టు విషయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు లెక్కలే వేరుగా ఉన్నట్లు కనిపిస్తోంది. రాజకీయంగా లాభ-నష్టాలు బేరీజు వేయడంలో జిల్లాలో అయన్ను మించిన వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఎయిర్‌పోర్టుతో స్థానికులకు ఉద్యోగాలు, బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగిపోతుందనే అంచనాలు అచ్చెన్నకు ఉంటే దానిని టెక్కలి నియోజకవర్గానికి ఎప్పుడు పట్టుకువెళ్లిపోయేవారు. బహుశా దాంతో మేలు కంటే రాజకీయంగా నష్టమే జరుగుతుందనే లెక్కలతోనే మందసకు తరలించడంతో తన వంతు విశేషమైన కృషి చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ నిర్ణయాల పరంగా కూడికలు, తీసివేతలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. మంచి జరిగితే మనకు, ముంచేదయితే పక్క నియోజకవర్గాలకు ఇచ్చేద్దామన్న తరహాలో ఆలోచించడం ఆయనకే చెల్లింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత జిల్లాకు భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రిఫైనరీ వస్తుందని ప్రచారం జరిగిన సందర్భంలో టెక్కలి నియోజకవర్గంలో ఏర్పాటుకు అవసరమైన భూమి ఉందంటూ సంకేతాలు ఇచ్చారు. రిఫైనరీ ఏర్పాటు ద్వారా రూ.లక్ష కోట్లు పెట్టుబడులతో పాటు పది వేల మంది వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయనే ఫీడ్ బ్యాక్ ఉండటంతో జిల్లాకు వస్తే నియోజకవర్గంలోనే ఏర్పాటు చేసేందుకు సిద్ధమైపో యారు. ఎయిర్‌పోర్టు విషయానికి వచ్చే సరికి దానిని పలాస నియోజకవర్గానికి ఉదారంగా వదిలేశారు. సరుకు రవాణా, కొంత మంది బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ రాకపోకలు సాగించ డానికే మందసలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నారు తప్ప దీంతో ప్రజలకు ఉపయోగపడింది ఏమీ లేదన్న విషయం సామాన్య జనానికి సైతం తెలిసిపోయిందంటే మంత్రి అచ్చెన్నకు తెలియదనుకోలేం. దీంతో మూలపేట పోర్టు ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా దానిని వదిలేసి, ఉద్దానాన్ని ఉద్ధరిస్తామంటూ ప్రకటనలు ఇవ్వడం మొదలెట్టారు.

ప్రభుత్వపరంగా ఏ చిన్న అవకాశం దొరికినా తమ మనుషులకు, తన నియోకవర్గానికి మేలు చేసేందుకు మంత్రి అచ్చెన్నాయుడు ఏ మాత్రం వెనుకాడరనటానికి ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలికి తరలించడం ఒక ఉదాహరణ. ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో అదనంగా మరో డిపోను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఉత్తర్వులు జారీ చేయించారు. తన మనుషులకు చెందిన గొడౌన్‌కు రూ.లక్షలు అద్దె చెల్లింపు, తమ కార్యకర్తలను అందులో నియమించుకునే పని రెండూ నెరవేరుతాయనేది ఇందులో ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇక నిధులు, అభివృద్ధి పథకాల కోసం చెప్పుకుంటే చాంతాడులా ఉంటుంది. గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల ద్వారా వచ్చే నిధులన్నీ టెక్కలి నియోజకవర్గానికే కుమ్మరిస్తున్నారు. టెక్కలి నియోజకవర్గానికి నిధులు తెస్తున్నారంటే ప్రజలపై ప్రేమ కంటే తన అనుచరులు, కాంట్రాక్టర్లకు రూ.కోట్లు కాంట్రాక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చడం ఈ అభివృద్ధిలో దాగున్న అసలు రహస్యమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతెందుకు ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాల కింద ఆర్థికసాయం అందించేందుకు దేవాదాయశాఖ జిల్లాలో ఏడు ఆలయాలను ఎంపిక చేస్తే... అందులో ఆరు టెక్కలిలోనే ఉన్నాయి. చివరకు నియోజకవర్గంలోని ప్రధాన హోదాల్లో తన సామాజిక తరగతికి చెందిన అధికారులు, మనుషులే ఉండాలన్న తపన కనబరిచే మంత్రి అచ్చెన్నాయుడు ఎయిర్‌పోర్టును మందసకు తరలించడం వెనుక అంతర్యాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టుతో నష్టమనే తమ ప్రాంతానికి తరలించారంటూ మరోవైపు ఉద్దానం ప్రాంత ప్రజలు అనుకుంటున్నారు.

మందసలో ఎయిర్‌పోర్టు నిర్మాణ విషయంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చాలా పట్టుదలగా కనిపిస్తున్నారు. ఎలాగైనా నిర్మించి తీరాలన్న నిర్ణయంతో ముందుకు వెళ్తున్నట్లుగా కనిపిస్తోంది. సామ వేదదాన దండోపయోగాలను ఉపయోగించి తమ పని నేరవేర్చుకోవాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే ఈ నెల ఐదో తేదీన పలాసలో ఎయిర్‌పోర్టుపై అవగాహనా సదస్సు నిర్వహించి ప్రజలను మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అక్కడికి మూడు రోజుల తర్వాత మందస మండలం ఎం.గంగువాడలో స్థానిక ప్రజలు నిర్వహించుకునే సభకు టెంట్ వేయనీయకుండా, ప్రజలను గ్రామాల నుంచి కదలనీయకుండా పోలీసు మార్క్ నిర్బంధం రుచి చూపించారు. చైతన్యానికి ప్రతీక నిలిచే ఉద్దానం ప్రాంత ప్రజలు బెదిరింపులు, అదిరింపులకు వెరవకుండా సభ నిర్వహించి తీరారు. పాలకులు తామనుకునే ప్రాజెక్టులు, పోర్టుల ఏర్పాటుకు ఎంతటికైనా తెగిస్తారు. అంతే స్థాయిలో ప్రజలూ ప్రతిఘటిస్తారు. ఇది ప్రభుత్వానికి, టిడిపికి తీవ్ర నష్టం కలిగించే అంశమే. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి అక్కడి ఓట్లు పోయినా జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో భర్తీ చేసుకునే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఆ నియోజకవర్గంతో సంబంధమే లేదు. ఎటొచ్చి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు రాజకీయంగా నష్ట కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికయినా ఆమె ప్రజాభిప్రాయానికనుగుణంగా నడుచుకుంటేనే మంచిదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లయిన **కుర్మాపు లేటు వెంకటరావు గారి కుమారుడు కుర్మాపు వెంకటపతి, శ్రీకాకుళం** తెలుపునది ఏమనగా, నా క్లయింటు దిగువ షెడ్యూల్ ఆస్తి శ్రీకాకుళం పట్టణం, చిన్నబజారు నివసస్తులు పల్లపులేటు రామశంకరరావు గారి కుమారుడు **1) పల్లపు సంతోష్ కుమార్‌రావు, 2) పల్లపు సురేష్ కుమార్, 3) పల్లపు సతీష్ కుమార్, 4) పల్లపు ఆశిష్ కుమార్** వారి ద్వారా కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని **30-08-2025**న పై తెలిపిన నలుగురు వ్యక్తులు నుండి క్రియ అగ్రిమెంట్ పొందియున్నారు. సదరు అగ్రిమెంట్ షరతులు ప్రకారం నా క్లయింటు **30-08-2025** నుండి నలభై దినములలోగా క్రియచీటి పొందవలెను.

కావున దిగువ షెడ్యూలు ఆస్తి క్రయ, విక్రయములపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు మరియు హక్కులు ఉన్న నేటి నుండి 7 రోజులు లోగా నాకు రాతపూర్వకంగా తెలుపవలెనని, లేనిచో ఎవరికి ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరములు, హక్కులు లేవని నిర్ణయించుకొని నాక్లయింట్ రిజిష్టర్ క్రియచీటి దిగువ షెడ్యూలు ఆస్తికి పొందుదురు.

షెడ్యూల్ : శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం పట్టణం, చౌకవార్డు, చిత్తరంజన్ వీధి మున్సిపల్ రోడ్‌కు పడమర శ్రేణిలో ఉన్నటువంటి **టి.యస్.నెం. 311 భాగం డో.నెం. 08-09-29** కలిగి **1085007602 మున్సిపల్ ఎసెస్మెంట్** కలిగి **131101A030982, 131101A104025216** కరెంట్ సర్వీస్ కలిగి **తూర్పు పడమరలకు** 63 అడుగులు, **ఉత్తర దక్షిణలకు** 15 అడుగులు 9 అంగుళాలు అనగా 110.25 చదరపు గజములు స్థలంలో నిర్మించిన 500 చదరపు అడుగుల విస్తీర్ణముగల గ్రౌండ్ ఫ్లోరు, 500 చదరపు అడుగులు విస్తీర్ణముగల ఫస్ట్ ఫ్లోరు, 168.75 చదరపు అడుగుల విస్తీర్ణంగల సెకండ్ ఫ్లోర్ కలిగియున్న డాబా మేడ ఇల్లుకు హద్దులు **తూర్పు :** చిత్తరంజన్ వీధి మున్సిపల్ రోడ్డు, **దక్షిణ :** బరాటం భాస్కరరావు డాబా యిల్లు. **పడమర:** బరాటం రామమూర్తి వగైరాల డాబాయింటి గోడ, **ఉత్తర :** పట్టపగలు మురళీక్రిష్ణ గారి డాబా యిల్లు.

వి.యస్.శ్రీనివాసరావు, అడ్వకేట్, శ్రీకాకుళం

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NARASANNAPETA.
O.S.12/2025

Between:
Pagoti Malathi. ......Petitioner/Plaintiff.
And:
Naviri Rajeswara Rao. ......Respondent/Defendant.

To,
Present residing at:
Naviri Rajeswara Rao, S/o Naviri Late Gannayya, Ph No. 76708 11848, D No.12-4/57, Flat No.6, S R Enclave, Near HP Petrol Bunk, Cross road, Nacharam, HYDERABAD - 500 076.
Permanently resident of : Naviri Rajeswara Rao, S/o Naviri Late Gannayya, Ph No.91211 58262.Flat No.F-1, RR Aborde, Sai Shiwani Nagar, Hythnagaram, Srikakulam Town, Srikakulam District. Pin-532 001.

Whereas the above named Plaintiff has instituted a suit against you for the suit claim. You are hereby summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **03rd day of November, 2025 at 10.30 am.** in the forenoon to answer the claim and at the day fixed for your appearance is appointed for the final disposal of the suit you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to react in support your defence.Take notice that in default of your appearance on that day before mentioned the suit will be heard and determined in your absence.

// BY ORDER OF THE COURT //

SD/- VANA SRINIVASA RAO
ADVOCATE,
Reg No.AP/576/1991, NARASANNAPETA,
SRIKAKULAM DISTRICT,
CELL NO. 95535 44677.

సంతకాలను సేకరిస్తున్న సిపిఎం నాయకులు

రైతుబజారు ఏర్పాటుకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పలాస

పలాస కేంద్రంగా రైతుబజారు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు టి.అజయ్‌కుమార్, వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపాలిటీలో తిలక్‌నగర్, పలు వార్డుల్లో శనివారం ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాసలో రైతుబజారు ఏర్పాటు అన్నది పట్టణ ప్రజల చిరకాల కోరికగా మిగిలిపోయిందని అన్నారు. పాలకులు మారినా సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. పట్టణ ప్రజలు రైతుబజారు ఏర్పాటుకు నిర్వహించనున్న ఆందోళనలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెప్పలరాజు, ఎం.పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

హోటళ్ల వ్యాపార ప్రగతికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలో హోటళ్ల ప్రగతికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే గొండు.శంకర్ అన్నారు. స్థానిక ఎస్.వి.డి. కన్వెన్షన్ హాల్‌లో జిల్లా హోటళ్ల అసోసియేషన్ కొత్త కార్యవర్గం శనివారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరవ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, హోటళ్ల అభివృద్ధి కోసం తగిన సహకారం అందిస్తానన్నారు. జిల్లా నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా హోటల్ మినర్వా మెట్ట నాగరాజు, జనరల్ సెక్రటరీగా ఇందిరా విజ్ఞాన్ భవన్ ఫంక్షన్ హాల్ కెల్ల కిశోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా సన్నా స్వీట్స్ అండ్ బేకరీ అందవరపు సతీష్, మీనా కృష్ణ ప్లాజా, వరం రెసిడెన్సీ అందవరపు తిరుమలరావు బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం టౌన్ బాడీ అధ్యక్షులుగా అరవల సతీష్, జనరల్ సెక్రటరీగా తుంబలి సుదర్శన్ పట్నాయక్, కోశాధికారిగా టంకాల కృష్ణ, ఎగ్జిక్టివ్ కార్యదర్శిగా ఎ.సతీష్, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, రాజాం, టెక్కలి, పాలకొండ, నరసన్నపేట మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐటిఐ మంజూరుకు వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిల్లాలో శివారు ప్రాంతంలో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఐటిఐ మంజూరుకు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంతంలో సాంకేతిక పరిజ్ఞానం శిక్షణ అవసరమని అన్నారు. ఇక్కడ లేకపోవడంతో అనేక మంది ఎన్నో వ్యయ ప్రయాసలతో దూర ప్రాంతానికి వెళ్లి శిక్షణ పొందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, వాళేశ్వరరావు, మదన్ మోహన్ బెహరా, కె.రామారావు, బి.సింహాచలం, బి.చంద్రశేఖర్, బి.శంకరరావ, లోహిదాస్ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న బిసి సంఘ నాయకులు

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

బిసి మహిళను మానసికంగా వేధిస్తున్న కొత్తూరు తహశీల్దార్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కూటికుప్పల సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలియ జేసి, అనంతరం డిఆర్ఒ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. లంచాలు అడగటం, మహిళలను ఫోన్ నంబర్లను అడగటం, లైంగిక వేధింపులకు పాల్పడటం వంటివి చేస్తున్నాడన్నారు. కీచక ఉద్యోగుల వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిసి సంఘ రాష్ట్ర కార్యదర్శులు పిళ్లా కన్నం నాయుడు, బూర్ల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కవిటి దేవరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి కిల్లి కుమారస్వామి, తూర్పుకాపు సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ 'ఎన్ డిమాట్రిక్స్' ఇటీవల నిర్వహించిన క్యాంపస్ నియామకాల్లో అన్ని విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు మరో 10 మంది ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రథమ వార్షిక వేతనంగా రూ.7 లక్షల ప్యాకేజీతో హైదరాబాద్‌లో ఉద్యోగం లభించిందన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచి, తమ మార్గదర్శకత్వంతో సహ విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని ఆశించారు. తోటి విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత స్థానాలలో స్థిరపడి కళాశాలకు మంచి పేరు తెస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ప్లేస్‌మెంట్ డాక్టర్ ఎం.సంతోష్ కుమార్, ప్లేస్‌మెంట్ శిక్షణ అధికారి డాక్టర్ వివిఐఎస్ఎస్‌పిఎస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు

పోలాకి : ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రారంభమైన చెకుముకి సైన్స్ సంబరాలు జయప్రదం చేయాలని పైడిభీమవరం హైస్కూల్ హెచ్ఎం టి.శోభారాణి పిలుపునిచ్చారు. మండలంలో 18 ప్రభుత్వ పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలల నుంచి 1500 మంది విద్యార్థులు పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎపిపిఎస్ టిఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డి.రాజశేఖర్, తిరుపతిరావు, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు: బుడుమూరు ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులు చదువు తున్న 50 మంది విద్యార్థులు ఈ పరీక్షను రాశారు. హెచ్ఎం రువ్వ పూర్ణచంద్రరావు, ఉపాధ్యా యులు పూజారి గోవిందరావు, ఎస్.కె.ప్రసాద్, ఎం. అనురాధ, కె.వెంకటరావు, పి.తమ్మినాయుడు, కె.చిన పెంటయ్య, ఎస్.రమేష్‌బాబు, ఇమ్రాన్ బేగ్, ఎల్.రమణమ్మ పాల్గొన్నారు.

పోలాకి : విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానంపై ఆసక్తిని, శాస్త్రీయ వైఖరిని పెంపొందించేందుకు చెకుముకి లాంటి ప్రతిభా పరీక్షలు దోహదం చేస్తాయని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అన్నారు. జన విజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు, సైన్స్ ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, నారాయణరావు, శ్రీహరి, శాంతి ఆధ్వర్యాన పాఠశాలలో చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు 104 మంది విద్యార్థులు చెకుముకి పరీక్ష రాశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు జి.శాంతి, ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, వేణు గోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, డోల వసంత రావు, తమరాపు రాంబాబు, సూర్యకుమారి, ధర్మేంద్ర పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : చెకుముకి ప్రతిభ పరీక్షలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుంట కోదండరావు అన్నారు. మండలంలోని

రణస్థలం : ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు : ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న కోదండరావు

పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షల ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కె.మాధవ రావు, బి.అన్నపూర్ణ, ఎస్.పాపారావు, ఎం. హరనాథ్, ఎన్.విష్ణుమూర్తి, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్ పాల్గొన్నారు.

టెక్కలి: విద్యార్థుల్లో విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం విజ్ఞానం అలవాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా శనివారం పాఠశాల స్థాయి పోటీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఈయన పాల్గొన్నారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలలో 8 ప్రైవేట్ పాఠశాలల నుంచి 1350 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మండల కన్వీనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పరీక్షలను కామేశ్వరరావు, పాలవలస ధర్మారావు పాల్గొన్నారు.

గిరిజన యువతకు శిక్షణ

కొత్తూరు : స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, భామిని మండలాలకు చెందిన గిరిజన యువతీ యువకులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మహిళా చట్టాలు, ల్యాండ్ రైట్స్, ఫారెస్టు రైట్స్, మహిళల భద్రత, చట్ట సభల్లో మహిళల పాత్ర, సమాచార చట్టం, ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.సంజీవరావు, రిసోర్స్‌పర్సన్లు కె.దాసునాయుడు, బి.క్రాంతి, బి.వెన్నెల, ఎ.చిరంజీవిరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆర్‌జియుకెటి శ్రీకాకుళం మెకానికల్ విభాగానికి చెందిన 51 మంది విద్యార్థులు శుక్రవారం విశాఖపట్నంలోని కల్పతరు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్‌ను ఒకరోజు పారిశ్రామిక సందర్శనగా నిర్వహించారు. ఈ సందర్శనలో విద్యార్థులు రోబోటిక్స్ ల్యాబ్, డ్రోన్స్ ల్యాబ్, ఐఒటి ల్యాబ్, 3డి ప్రింటింగ్ ల్యాబ్‌లను సందర్శించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతలు, ఆటోమేషన్ పద్ధతులు, స్మార్ట్ పరికరాలు, పరిశ్రమల్లో ఉపయోగించే డిజిటల్ ఇన్నోవేషన్ విధానాలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. ఈ సందర్శన కార్యక్రమం ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ మార్గదర్శకత్వంలో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకాడెమిక్స్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ వాసు, మెకానికల్ విభాగాధిపతి సి.ప్రకాష్ సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది.

'కంచరాన'కు అవార్డు

ప్రజాశక్తి- అరసవల్లి

ఉపాధ్యాయులు, ప్రముఖ కవి, రచయిత కంచరాన భుజంగరావు రచించిన నీటిగింజల పంట సంపుటికి రొట్టమాకురేవు కవిత్వ అవార్డును ప్రకటించినట్లు భుజంగరావు తెలిపారు. ఈ అవార్డు నవంబర్‌లో హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు ఖమ్మం జిల్లాకు చెందిన రొట్టమాకురేవు సాహిత్యసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, కవి యాకుబ్ ప్రకటించినట్లు భుజంగరావు తెలిపారు. త్వరలో తేదీని ప్రకటిస్తారన్నారు. అలాగే నీటిగింజల పంట కవితా సంపుటికి కడప జిల్లా ప్రొద్దుటూరులో ప్రతిష్టాత్మకమైన పల్లా జాతీయ కవితా పురస్కారం 2024లో అందుకున్నారు. అదే విధంగా మొట్ట మోదట గుంటూరుకు చెందిన రావి రంగారావు సాహిత్య పీఠం నుంచి జనరంజక కవి ప్రతిభా పురస్కారం 2023లో కూడా అందుకోవడం జరిగిందని తెలిపారు.

పింఛన్లు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

అర్హులందరికీ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు మంజూరు చేయాలని దళిత మహాసభ మండల ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణరావు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బసవ రాంబాబును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వితంతు, ఒంటరి మహిళకు తక్షణమే పింఛను వర్తింపజేయాలన్నారు.

విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- ఆమదాలవలస:

మండలంలోని దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన 9 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యులు బి.జానకి రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేధ సర్వో డ్రిల్స్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ పరీక్షల్లో జె.అపర్ణ, డి. సాయి కార్తీక్ రెడ్డి, మణిబాబు, వి.గణేష్, టి.పద్మలిఖిత, బి.నందిని, కె.వెంకటరాజు, పి. అనిల్, పి.చరణ్‌లు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికైన వీరికి ఏడాదికి రూ.3.3 లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ముందస్తు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని భారతీయ విద్యా కేంద్రం నిర్వహిస్తున్న ఆర్ష విజ్ఞాన భారతి, కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ముందస్తు నరకచతుర్దశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలో, ప్రత్యేకంగా సత్యభామ వేషాలలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యుడు అనిల్, ప్రిన్సిపాల్ బిందుమాధవి దీపావళి పండగ ప్రాధాన్యాన్ని వివరించారు. చెడుపై మంచి విజయం సాధించిన దినంగా దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల,

కవిటి : వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి : దీపాల అలంకరణలో కూర్చున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక స్వర్ణభారతి విద్యాసంస్థల ప్రాంగణంలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ చాట్ల మహేశ్వరి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.లీలాలక్ష్మి, చాట్ల రాము పాల్గొన్నారు.

టెక్కలి : పట్టణంలోని ఒక్లాండ్ పాఠశాల ప్రిన్సిపాల్ మల్ల మధులత ఆధ్వర్యాన ముందస్తు దీపావళి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగోలితో అలంకరణలు, సాంప్రదాయ వస్త్రధారణలు, దీపాల ప్రదర్శన అలరించి ఆకట్టుకున్నాయి. విద్యార్థులు దీపాల ఆకారంతో కూర్చున్న ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారులపై దుకాణాలను తొలగించాలి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు - చిలకపాలెం రహదారిలో పలు గ్రామాల వద్ద రహదారిపై ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను తక్షణమే తొలగించాలని దుకాణాదారులకు ఆర్అండ్‌బి ఎఇ పి.టి.రాజు, ఎస్ఐ వి.సత్యనారాయణలు తెలిపారు. మండలంలోని లోలుగు గ్రామం వద్ద శనివారం రహదారిపై దుకాణాలు ఏర్పాటు చేసిన దుకాణాదారులతో మాట్లాడారు. ఈ రహదారిలో ప్రధానంగా లోలుగు, రాపాక కూడలి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకూ ఆర్అండ్‌బి రహదారిపైనే దుకాణాలు ఏర్పాటు చేశారని, వాటిని తక్షణమే తొలగించాలని హెచ్చరించారు. ఈ దుకాణాల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోతుందన్నారు. రహదారులపైకి వచ్చిన

దుకాణదారులతో మాట్లాడుతున్న ఎఇ, ఎస్ఐ

దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లు కొమ్మలను, పొదలను తొలగించారు.

అవగాహన కల్పిస్తున్న జడ్జి పరేష్ కుమార్

ర్యాగింగ్‌కి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కి పాల్పడితే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని, విద్యార్థులు ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పరేష్ కుమార్ అన్నారు. స్థానిక స్వర్ణ భారతీ విద్యా సంస్థలో ఇచ్ఛాపురం మండల లీగల్ సెల్ ఆధ్వర్యాన యాంటీ ర్యాగింగ్ చట్టం గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ ఎం.చిన్నంనాయుడు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్ణ భారతి విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీ, ఈగల్ క్లబ్, స్టూడెంట్ కౌన్సెలింగ్ కమిటీ ఆధ్వర్యాన చెడు సంఘటనలు జరగకుండా విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగే విధంగా కార్యక్రమాలు చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ చాట్ల మహేశ్వరిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల దివ్య భారతి, టౌన్ ఎస్ఐ ముకుందరావు, న్యాయవాది దక్కత కృష్ణమూర్తి, కళాశాల ఇన్‌ఛార్జి చాట్ల రాము, ప్రిన్సిపాళ్లు సందీప్, జల్లు జయప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లినలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి- బూర్జ

పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అల్లినలో ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పశు గణాభివృద్ధి సంస్థ పశువైద్యులు డా శరత్ చంద్ర మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులపై ఖచ్చితమైన అవగాహన పశుపోషకులు అందరికీ ఉండాలని సూచించారు. సంతానోత్పత్తికి ఉపయోగపడని పాడిపశువులను పశు వైద్యుల సూచనలు, సలహాలతో వైద్యం చేయించు కుని సంతానానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పాడి పశువుల కొనుగోలు రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల, పశువుల కొనుగోలు చేయడం కష్టమని, అందువలన తమ దగ్గర ఉన్న పశువులనే సంతానానికి పనికి వచ్చే పశువులుగా మార్చుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడదూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులందరూ

మాట్లాడుతున్న శరత్‌చంద్ర

ఉపయోగించుకోవాలన్నారు. ఈ పథకం ప్రకారం ఎద ఇంజక్షన్ ఖరీదు రూ.300 అయినప్పటికీ సబ్సిడీపై రూ.150 అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో 82 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందించారు. రూ.17 వేలు విలువచేసే మందులను పశుపోషకులకు పంపిణీ చేశారు. సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు సీతారాంబాబు, కొల్లివలస, గుత్తావల్లి వైద్యులు హేమ, సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

రణస్థలం: కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమ కార్యక్రమం శనివారం మండలంలోని జె.ఆర్.పురంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఎచ్చెర్ల నియోకవర్గ పరిశీలకులు పెనుమత్స సురేష్ రాజు పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని, ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. పిపిపి విధానంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ ఆలోచనని విరమించుకోవాలని అన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకువస్తే, ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు ఒక్క మెడికల్ కాలేజీని కూడా తెచ్చే పరిస్థితి లేదన్నారు. వచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు వాళ్ళ చేతుల్లో పెట్టి కోట్లాది రూపాయలకు అమ్మేయాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణచైతన్య

పోలాకి: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయకుండా పోరాడాలని ధర్మాన కృష్ణచైతన్య కోరారు. మండలంలోని ఈదులవలస జంక్షన్ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈదులవలస, కుసుమపోలవలసలి క్లస్టర్ పరిధి రచ్చబండ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, రాష్ట్ర యువజన కార్యదర్శి చింతు రాఘవ, నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ విభాగం అధ్యక్షులు వై.వి.రమణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరిస్తున్నామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని అరకభద్ర,

రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్ రాజు

టి.బరాపురం గ్రామాల్లో శనివారం సంతకాలు సేకరించారు. అలాగే ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం వైసిపి గ్రామ, అనుబంధ కమిటీల నియాకమంపై చర్చించారు. బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, వైసిపి నాయకులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, సాడి కాంచనమ్మ, ఆవి కేదారి, నీలాద్రి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని అక్కయ్యవలస, కిష్టుపురం, కన్నేవలస, కొత్తపేట గ్రామాల్లో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు హేమసుందర్ రాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రామారావు, జెడ్‌పిటిసి వెంకటరావు, నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, అప్పలస్వామి పాల్గొన్నారు.

మృతి చెందిన సత్యనారాయణ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆర్‌టిసి బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది. సిసి కెమెరా దృశ్యాలు నగరంలో హల్ చల్ చేస్తున్నాయి. నగరంలోని రాధాకృష్ణ నగర్‌కు చెందిన బిల్డర్ వంకదార సత్యనారాయణ (64) శనివారం బైక్‌పై డేఅండ్‌నైట్ కూడలి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. స్కూటర్ డ్రైవ్ చేస్తున్న వ్యక్తి బస్సు గమనించలేదు. ఆర్‌టిసి బస్సు నడుపుతున్న డ్రైవర్ గణించకపోవటంతో ఈ ప్రమాదం జరిగింది. ముందు టైరు కింద పడిన వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ట్రాఫిక్ సిఐ నాగరాజు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచాను స్వాధీనం చేస్తున్న పోలీసులు

కాశీబుగ్గలో బాణసంచా పట్టివేత

పలాస : కాశీబుగ్గలో బాణసంచా అక్రమ నిల్వలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పి.జగదీశ్ అనే వ్యక్తి ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. దీని విలువ రూ.5,23,306 ఉంటుందని అంచనా వేశామన్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలో కొనుగోలు చేసి కాశీబుగ్గలో విక్రయించేందుకు తీసుకొచ్చారని అన్నారు. దీనికి ఎటువంటి అనుమతులు లేవని వెల్లడించారు.

రోడ్డుకు ఇరువైపుల వేసిన వ్యర్థాలు

చెత్తతో అవస్థలు

ప్రజాశక్తి- మందస

మండలం హరిపురం నుంచి సోంపేట వైపు వెళ్లే రోడ్డు మార్గాన రోడ్డుకు ఇరువైపులా మిగిలిపోయిన తినిబండారాలు, మాంసపు దుకాణాల నుంచి వచ్చిన వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా వేసేయడంతో రాత్రి, పగలు కుక్కలు నిరంతరం అక్కడే ఉండి స్వైర విహారం చేస్తూ ఒక్కసారిగా రోడ్లపైకి రావటంతో స్పీడుగా వెళ్తున్న వాహన చోదకులు ఏ క్షణాన ఏమి జరుగుతుందో అని బెంబేలెత్తిపోతున్నారు. హరిపురం కేంద్రంలో తడిచెత్త, పొడిచెత్త కేంద్రాలు ఉన్నప్పటికీ అక్కడికే తీసుకెళ్లి వేయకుండా రోడ్డుపక్కన పడేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న సిఐ రమేష్

తీరప్రాంత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కవిటి

తీరప్రాంత పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సిఐ రమేష్ అన్నారు. మండలంలోని కపాసుకుద్దిలో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఆధ్వర్యాన మత్స్యకారులకు తీర ప్రాంత పరిరక్షణ, సముద్ర భద్రతపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్, శ్రీఎస్ఐ కోదండరావు, హెచ్‌సి ఉమ మత్స్యకారుల భద్రతా పరికరాల వినియోగం, సముద్రంలో ప్రమాద సమయంలో పాటించాల్సిన నియమాలు, వాతావరణ హెచ్చరికలపై జాగ్రత్త సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, కార్యదర్శి మన్మథరావు, మత్స్యకార శాఖ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

ఆమదాలవలస: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు తల్లి రత్నాలమ్మ ఇటీవల మృతి చెందడంతో పలువురు శనివారం అన్నాజీరావును పరామర్శించారు. ఈ సందర్భంగా రత్నాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా డిసిసి అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, కూటమి నాయకులు పైడి వేణుగోపాల్, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, జనసేన నాయకులు పేడాడ రామ్మోహన్, కూటమి నాయకులు పేడాడ సూరప నాయుడు, న్యాయవాదులు అన్నెపు నరసింహమూర్తి, సీపాన గోవిందరావు, ఎండ అప్పలనాయుడు, సనపల నర్సింగరావు, తాండ్ర రాము తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

ఇచ్ఛాపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఈదుపురం ఒడియా జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. అండర్-17 విభాగంతో త్రో బాల్‌లో కృష్ణదాస్, స్విమ్మింగ్‌లో సోమేష్ బెహరా, అండర్-14 విభాగం స్విమ్మింగ్‌లో మహాలక్ష్మి బెహరాలు ఎంపికయ్యారు. హెచ్ఎం ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయులు భాస్కరపాడి పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు

మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేష్

అక్రమ మైనింగ్ చేపడితే చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ చేపడితే సంబంధిత క్వారీ యాజమాన్యంపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ టి.వెంకటేష్ హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయంలో శనివారం క్రషర్స్, క్వారీ యాజమాన్యంతో సమావేశాన్ని నిర్వహించారు. క్వారీల్లో పేళుల్లు, పిడుగులు పడే సమయంలోను కార్మికులకు భద్రతాపరమైన రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కల్పించాలని, క్వారీల్లో పేళ్లుల్లు జరిపేటప్పుడు కార్మికులను, సమీప ప్రజలను, రహదారిపై వాహనదారులను హెచ్చరించేలా సైరన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమతులు పొందిన తరువాతనే మైనింగ్ జరపాలన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలను చెల్లించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు సమావేశంలో తెలియజేసిన అన్ని అంశాలను పదిరోజుల్లో ఏర్పాటు చేసుకోవాలని యాజమాన్యానికి ఆయన సూచించారు. క్వారీల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ వి.సత్యనారాయణ, క్వారీ, క్రషర్స్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణ

ఆదివాసీలతో ముఖాముఖి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బ్రేడ్స్ ఆధ్వర్యాన మండలంలోని సీరియఖండి సచివాలయంలో ఆదివాసీ గిరిజనులకు, సచివాలయం సిబ్బందికి మధ్య ముఖాముఖి శనివారం నిర్వహించారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉపాధి హామీ, సిఎం కిసాన్, మాసమే మైక్రో స్మాల్ అండ్ మార్జినల్ ఎంటర్ప్రెనర్షిప్ స్కీమ్ సంబందించిన ఫోర్ వీలర్ తీసుకొంటే 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. అలాగే కార్ సర్వీస్ సెంటర్ పెడితే 30 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఇది కేవలం గిరిజన కుటుంబాలకే మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ లక్ష్మీనారాయణ, సర్పంచ్ భాస్కరరావు, ఉప సర్పంచ్ బాబూరావు, బ్రేడ్స్ కో-ఆర్డినేటర్లు రామచంద్రరావు, యోగేష్ పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ల చైర్మన్ల నియామకం

విజయలక్ష్మి చంద్రశేఖరరావు

కోటబొమ్మాళి/నందిగాం : కోటబొమ్మాళి పిఎసిఎస్ చైర్‌పర్సన్‌గా వెలమల విజయలక్ష్మి, సభ్యులుగా ఎస్.ఆనందరావు, సకలాబత్తుల రాంకుమార్, తెంబూరు పిఎసిఎస్ చైర్మన్ పోలాకి చంద్రశేఖర్‌రావు, సభ్యులుగా బెండి జగదీష్, మద్దిల అనంతయ్య, దిమిలాడ పిఎసిఎస్ చైర్మన్‌గా పినకాన అజయ్‌కుమార్, సభ్యులుగా పురట ఉమాపతి, పాలిన వీరాస్వామి, నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియమితులైన చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలు గుర్తించి పిఎసిఎస్ చైర్మన్లుగా, సభ్యులుగా నియామకానికి కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

అవగాహన జాతా నిర్వహిస్తున్న కళాకారులు

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, గ్రామ పెద్దలు, మెడికల్ సిబ్బంది కలసి పాగా, డ్రగ్స్‌కు సంబంధిత ఉత్పత్తులు వాడవద్దని కళా జాతాలు, వీధి నాటకాలు, ఒగ్గు కథలుతో ప్రచారం చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి చైతన్య గీతాలు శనివారం ఆలపించారు. ర్యాలీలో తన బాధ్యతగా సిమ్మ సింహాచలం గ్రామ పెద్ద పాల్గొని మాదకాలు వల్ల అనర్థాలు తెలియజేశారు. షణ్ముఖ మాస్టర్ ఆధ్వర్యాన ప్రదర్శించిన డ్రగ్స్ వద్దు బ్రో ఒగ్గు కథ ఆకట్టుకుంది. డ్రగ్స్ వాడకం, ట్రాఫికింగ్ గుర్తిస్తే 1972, 112కి తెలపాలని కోరారు. కార్యక్రమంలో శాంతకుమారి, గోవిందరావు, గోవిందరావు, కామేశ్వరరావు, సుజాత, గౌరీ, దామోదర రావు, తిరుపతి, గోపి, సునీల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలో ధనత్ర యోదశిని పురస్కరించుకొని నాయీబ్రహ్మణలు ధన్వంతరి జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. కోటబొమ్మాళి నాయీబ్రహ్మణ కమ్యూనిటీ భవనం ఆవరణలో ధన్వంతరి విగ్రహానికి నాయీబ్రహ్మణ జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస శోభారాణి, లక్ష్మి, కనకరాజు, వీరాస్వామి, ఆర్మీ శ్రీనివాస్, జనసేన నాయకులు ప్రసాద్, సందీప్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రిద్దాం

శ్రీకాకుళం సిటీ : ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాలుష్యం నియంత్రిద్దామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బ్యాటరీ బైకులపై కలెక్టరేట్ సిబ్బందికి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొల్యూషన్ లేని వాహనాలు, సోలార్ వాడటం వలన జీవ వైవిధ్యానికి నష్టం ఉండదన్నారు. గాలిలో పొల్యూషన్ లేకుండా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కనాటి పర్యావరణాన్ని పరిరక్షిం చాలన్నారు. బ్యాటరీ వాహనాలు వాడి వాయు కాలుష్యం తగ్గించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి స్వఛ్ఛాంధ - స్వర్ణాంధ్రపై కలెక్టరేట్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పి.వి గంగాధర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, ఆయా విభాగాల పర్యవేక్షకులు రామమూర్తి, సురేష్, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం 'స్వచ్ఛ ఆంధ్రా' నిర్వహించారు. ఆయా విభాగాల వద్ద జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని తమ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. వర్శిటీ ఉన్నతాధికారులు, రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన క్యాంపస్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్ రజనితో పాటు రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ, స్వచ్ఛ ఆంధ్రా క్యాంపస్ నోడల్ అధికారి డా. డి. చక్రపాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీలో 'స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్'లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, సెక్రటరీ జీవన్ కుమార్, గొర్లె హరి, కేలం వెంకట రమణ, కెళ్ల లక్ష్మీనాయుడు, గులివిందల శంకర్, సురేష్, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, పారిశుధ్య కార్మికులు, యువత తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా పరిషత్ సిఇఒ బి.సత్యనారాయణ సూచించారు. పోలాకి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్రలో పాల్గొని మొక్కలు నాటారు. అలాగే సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎల్.వి. మదు, ఎంపిడిఒ జి.రవికుమార్, డిప్యూటీ ఎంపిడిఒ పద్మావతి, పరిపాలన అధికారి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీలో ఎంపిడిఒ ఎం.రేణుక ఆధ్వర్యాన స్వర్ణాంధ్రలో భాగంగా ర్యాలీ, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు, ఎఎంసి డైరెక్టర్ రాంజీ ఇన్‌ఛార్జీ డిప్యూటీ ఎంపిడిఒ పి.సోమేశ్వరరావు, ఎపిఒ ప్రసాద్, కార్యదర్శి ఎ.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఒ త్రినాథ్ అన్నారు. స్వర్ణాంధ్రలో భాగంగా కవిటి ఎంపిడిఒ కార్యాలయం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం హానికరమని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. 'ప్లాస్టిక్ వ్యర్థాలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎఒ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పురపాలక సంఘం పరిధిలో స్వర్ణాంధ్రల భాగంగా ఇన్‌ఛార్జి కమిషనర్ అప్పలస్వామి ఆధ్వర్యాన క్లీన్ ఎయిర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ బాలిక, బాలురు హైస్కూళ్ల విద్యార్థులు క్లీన్ ఎయిర్‌గా కూర్చిన చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. గాంధీ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సూర్యారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యం సొంతమవుతుందని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మెళియాపుట్టిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు, ఇసి ఆదినారాయణరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు, టిడిపి తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : క్లీన్ ఎయిర్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

వజ్రపుకొత్తూరు : కాలుష్య నివారణతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎంపిడిఒ రమేష్‌నాయుడుతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు టి.హిమారావు, బి.లక్ష్మీపతి, ఉపేంద్ర, చక్రవర్తి పాల్గొన్నారు.

మందస : మండలంలోని బాలిగాం పంచాయతీ వీరభద్ర, కొత్తపల్లి గ్రామాల్లో స్వచ్ఛాంధ్రపై వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఒఎలు మోహిని, చంద్రకళ, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు మీనాక్షి, బాలకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు: మండలం తండ్యాంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రఘునాథ్, సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కరరావు, కార్యదర్శి శంకరరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న గిరిధర్

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి టెక్కలి రూరల్

టెక్కలి మండలం భగవాన్‌పురం ప్రాథమికోన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. శక్తి టీం ఇన్‌ఛార్జి గిరిధర్ ఆధ్వర్యాన గ్రామస్థులకు, శక్తి యాప్ డౌన్‌లోడింగ్, యాప్ ఉపయోగాలు టోల్ ఫ్రీ నంబర్ల పనితీరుపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో శక్తి యాప్‌లో ఆత్మ రక్షణ కలుగుతుందని, ప్రతి మహిళ తమ ఫోన్‌లో శక్తి యాప్ కలిగి ఉండాలని సూచించారు. సర్పంచ్ సుకన్య, టిడిపి మండల మహిళా అధ్యక్షులు మెండ దమయంతి ,హెచ్‌ఎం రామారావు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కార్తీక మాసం సందర్భంగా మహేంద్ర తనయా ఒడ్డున అయ్యప్ప స్వామి యాత్రికులు, మహిళలు, గ్రామస్తులు స్నానమాచరించేందుకు అనువుగా చేసేందుకు శనివారం ప్రొక్లెయినర్‌తో శనివారం జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యాన చేపట్టారు. స్థానికుల సహకారంతో పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచే చర్యలు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఆర్.వాసు, కార్యదర్శి శిష్టు కిషోర్‌కుమార్, శంకర్‌రెడ్డి, గాలి రామారావు, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి బస్టాండ్‌లోని చెరువు గట్టుపై వాసం ఉంటున్న పాలిన బుద్దెమ్మకు స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు శనివారం ఆర్థికసాయం అందించారు. ఇటీవల ఆమె తీవ్ర బ్రెయిన్ హార్ట్ స్ట్రోక్‌కు గురైంది. పరిసర ప్రాంతాల వారు పలాసలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రి ఖర్చులు కనీసం కూడా చెల్లించుకోలేని పరిస్థితిని తెలుసుకున్న స్ఫూర్తి సేవా సంస్థ ఆమె చికిత్స కోసమని రూ.20 వేలు సేకరించి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కెంగువ రాంబాబు, బమ్మిడి మన్మథరావు, బాలరాజు, శరత్, అర్జి తులసీరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు

ప్రజాశక్తి- బూర్జ

ఆధునిక యజమాన్య పద్ధతులతో అధిక లాభాలు పొందవచ్చని ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని గోపిదేవిపేటలో నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యానవన శాఖ సహకారంతో ఆర్ష్ సంస్థ, నాబార్డ్ వనసహజ ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా జీడి, మామిడి పంటల యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి, మామిడి పంటలు ఆదాయాన్ని రెట్టింపు చేసే పంటలు కావడంతో రైతులు వాటిలో ఆధునిక యాజమాన్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అన్ని విధాలుగా సహకరిస్తోందని, ఈ శిక్షణల్లో నేర్చుకున్న పద్ధతులను ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నైరా కాలేజ్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పి. సీతారాం, ఆర్ష్ సంస్థ డైరెక్టర్ ఎన్. సన్యాసిరావు, ఉద్యాన శాఖ అధికారులు అయంతిగ, సచివాలయ సిబ్బంది వసంత, ఇతర సిబ్బంది, సంస్థ సిబ్బంది, మన్యం సహజ ఎఫ్‌పిఒ సిఇఒ బి.శంకరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

ముగ్గులు వేస్తున్న చిన్నారులు

హరిత దీపావళి చేసుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

బుడుమూరు ఉన్నత పాఠశాలలో హరిత దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీపావళి పండుగలో భారీగా పటాకులు కాల్చడం వలన వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగి పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, ఈ పరిస్థితిని మార్చడానికి హరిత దీపావళిని మనమంతా జరుపుకోవాలని ఎపి ఎన్‌జిసి కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు విజ్ఞప్తి చేసారు. ఎక్కువ శబ్దం వచ్చే పటాకులు కాల్చకుండా దీపాలు, కొవ్వొత్తులు వెలిగించడం, కుటుంబ సభ్యులు, మిత్రులతో చెట్లు నాటడం వలన కాలుష్యం తగ్గుతుందన్నారు. హెచ్‌ఎం రువ్వ పూర్ణ చంద్రరరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని పరిసరాలను అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముగ్గులు వేసి, దీపాలు వెలిగించి ఆనందోత్సవాలతో దీపావళి పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, కె.వెంకట రావు, పి.తమ్మినాయుడు, కె.చినపెంటయ్య, ఎస్.రమేష్ బాబు, ఇమ్రాన్ బేగ్, ఎల్.రమణమ్మ పాల్గొన్నారు.

పొందూరు: కాలుష్యరహితంగా హరిత దీపావళిని జరుపుకోవాలని తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బల్ల కంటయ్య అన్నారు. పాఠశాలలో హరిత దీపావళిని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ప్రదర్శించిన హరిత దీపావళి, రంగవల్లికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని మెట్టక్కివలస 10వ వార్డు పరిధిలోని వాంబేకాలనీలో ఉన్న శ్మశాన వాటికలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో నాలుగు నూతన విద్యుత్ స్తంభాలను విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బిసి సంఘం కార్యదర్శి, జిల్లా టిడిపి సాధికారిత కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియలు నిర్వహించే సమయంలో విద్యుత్‌దీపాలు లేక చీకటిలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి మున్సిపాలిటీలోని 5, 9, 10, 11 వార్డుల ప్రజలు సమస్యను తీసుకువెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి స్మశాన వాటికలో నాలుగు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించారన్నారు. తమ చిరకాల సమస్యను పరిష్కరించినందుకు పరిసర వార్డుల ప్రజలు, టిడిపి నాయకులు రాడ విజయ్ కుమార్, బారుగుల సంతోష్ కుమార్, పొన్నాడ తులసి, సిగడాం తులసి తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

కవిటి : మాట్లాడుతున్న ఎంఇఒలు

నైపుణ్యాన్ని పెంపొంచుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

తరగతి గదిలో దిగువ శ్రేణి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలని ఎంఇఒ ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ సూచించారు. మండలంలోని ఆరు పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయానికి సిలబస్ పూర్తిచేసేలా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. టూల్ 1, టూల్ 3 విద్యార్థులతో చేయించాలని చెప్పారు. హులిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థుల పూర్తిస్థాయిలో బోధన కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిఆర్‌పిలు, సిఆర్‌పి తులసి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : ఉపాధ్యాయుల్లో అంతర్గతంగా ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసే క్రమంలో ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహిస్తున్న క్లస్టర్ సముదాయాన్ని వినియోగించుకోవాలని ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి దాసుపురం చిన్నారావులు కోరారు. మండలంలోని నిర్వహించిన పలు క్లస్టర్ సముదాయాలను పర్యవేక్షించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు

కంచిలి: ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, హితులు, సన్నిహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ నరేష్ కుమార్ అగర్వాల్ నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు ఎంపిటిసిలు పి.కృష్ణారావు, కృష్ణారావు, పొల్లాయి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

హృద్రోగ సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హృద్రోగ సంబంధించిన సమస్యలపై ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులపై శనివారం ప్రదర్శన నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె పోటు వచ్చినప్పుడు మొదటి గంట కాలం చాలా ముఖ్యమైనది అని తెలిపారు. గుండె పోటు వచ్చిన వ్యక్తికి తన గుండెపై 30 స్ట్రోక్‌లకొకసారి కృత్రిమ శ్వాస ఇవ్వడం ద్వారా ప్రణాలను కాపాడుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, రెడ్ రిబ్బన్‌క్లబ్, స్త్రీ సాధికారత సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యమున పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

వైద్య శిబిరానికి స్పందన

కోటబొమ్మాళి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని స్థానిక ఎస్ఐ వి.సత్యన్నారాయణ తెలిపారు. కొత్తపేటలోని సాయికోమలి ఆస్పత్రిలో శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు శనివారం ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరానికి 102 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ కెల్లి సతీస్, డాక్టర్ ప్రభు, నిర్వాహకులు పట్నాన షణ్ముఖరావు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో ఉపశమనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిఎస్‌టి తగ్గించటంతో ప్రజలకు ఉపశమనం కలుగుతుందని మోటార్ వెహికన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్ పేరుతో ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పన్నులు తగ్గడంతో వాహనాలచ ధరలు బాగా తగ్గాయని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కాళీప్రసాద్‌పండా, కె.రామారావు, పి.ప్రతాప్‌రెడ్డి, పొట్నూరు గోపి, కుమార్, ఇసురు భాస్కర్ పాల్గొన్నారు.